బ్యూటీక్వీన్‌ని
పెళ్లి చేసుకోవాలని
అనుకున్న
అతని కల
ఫలించిందా?

# బ్యూటీక్వీన్




"ప్చ్! లాభంలేదురా! ఈ అమ్మాయి నచ్చలేదు నాకు" చిరాకుగా అన్నాడు అతను.

"నీ మొహం! నీకసలు ఏ పిల్లన్నా నచ్చి ఏడిస్తేగా..." విసుక్కున్నాడు ఆ ఫ్రెండు.

"ఏం చెయ్యను చెప్పు! ఓ పిల్ల తెల్లగా పాలిపోయి వుంటే మరో పిల్ల సింగరేణి కాలరీస్ సరుకు... ఒక అమ్మాయి ఒక్క కొంగపిట్టకు తోలుకప్పినట్టు వుంటే మరో ఓపిల్ల సిలెండర్‌లా పూరిపోయి వుంటోంది. నాక్కావలసిన పడుచుపిల్ల ఎప్పుడు దొరుకుతుందో... ఏవిటో...?" కొంచెం నిస్పృహ దొర్లుతూ ఆ మాటల్లో...

"అసలు నీకు కాబోయే భార్య ఎలా వుండాలో చెప్పి చావు?"

"చక్కగా కవ్వించే కళ్లతో మాంచి మిసమిసలాడే రంగులో మెరిసిపోతూ వుండాలి. చూడ్డానికి ఎరోటిక్‌గా ఫేషనేట్ లుక్స్‌తో అలరారుతూ..." తన్మయంగా అతను చెప్పుకుపోతూనే వున్నాడు.

కానీ ఈలోగా ఆ ఫ్రెండే అతనివైపు ఓ విచిత్రమైన చూపు చూసి, అంతలోనే మామూలైపోతూ...

"గాడ్! ఏవిటి నీ ఉద్దేశ్యం! పెళ్లి చూపుల్లో ఏ అమ్మాయి అయినా సెక్సీగా కనిపిస్తుందేవిటిరా? మతిలేని మాటలూ... నువ్వూను... నలుగుర్లోనూ పైట వదిలేసి ఓ అపరిచితుడి దగ్గర కూర్చుంటుందా? ఛ! ఛ! అయినా కాపురం చేసుకునే పడదానిలో క్యాబరే లుక్స్ కావాలంటేవేవిటి? పక్కమీద నీకు కోపరేట్ చేస్తే చాలు! అసలు ఇలా అయితే నీకు పిల్ల దొరికిన



ట్టే? పెళ్లి అయినట్టే?'' ఫకాలున నవ్వేశాడు ఆ స్నేహితుడు. అయినా — ఆ మాటలకు నవ్వేస్తూ...

''చూస్తూండు! ఓ మంచి చక్కటి అమ్మాయి దొరికి తీరుతుంది. నా పెళ్లాం అయిపోతుంది. నేను గొప్ప ఆశావాదిని'' నవ్వేశాడు అతను.

☆ ★ ☆

"ఒరేయ్! సాయంత్రం పెళ్లిచూపులకె ళ్లాలి! శాస్త్రిగారు మంచి సంబంధం తెచ్చారు! అమ్మాయి గొప్ప అందగత్తెట! కలవారి పిల్లకూడాను! ఈసారన్నా నీకు నచ్చితే... ఆ నాలుగక్షింతలు వేసేసి, నేనూ, మీ నాన్న మన వూరెళ్లిపో ' ఈ వయసులో నిన్ను కనిపెట్టుకుంటూ చూసుకునే బాధ్యత తప్పుతుంది" తల్లిమాటలకు 'వూ' కొడుతున్నాడే గానీ అతనిమనసు వూహల్లో తేలిపోతోంది.

'అబ్బ! ఈసారన్నా ఓ విపేషియస్ బ్యూటీ దొరికితే బాగుండును. ఎంచక్కా టక్కున తాళికట్టేసి చటుక్కున హనీమూన్‌కు వెళ్ళొచ్చు' వయసుచేసే తొందరలు అతని కలలకు సెన్సార్‌లేకుండా చేసేస్తోంది.

సాయంత్రం నాలుగింటికే డెస్క్ లాక్ చేసేశాడు. ప్రశ్నార్థకంగా చూస్తోన్న ఫ్రెండ్‌వైపు అర్థవంతంగా నవ్వేశాడు...

"ఓహో! కాబోయే పెళ్లికొడుకుగారా?! వెరీగుడ్! ఈసారైనా అమ్మాయి నచ్చితే నీ తరపున ఆ దేవుడికి నేనో కొబ్బరికాయ కొడతాను. వెళ్లిరా! బెస్ట్ ఆఫ్ లక్" అని విష్ చేశాడు.

ఇంటికొస్తూనే — ఫ్రెష్‌గా స్నానంచేసి కొలోన్ స్ప్రే చేసుకుని ప్రెస్ చేసి బట్టలు వేసేసుకుని యమా స్మార్ట్‌గా డ్రెస్సప్ అయిపోయాడు.

కొడుకు ముస్తాబుచూసి "బానే వుంది! హడావుడి! వీడి కళ్లకి ప్రపంచ సుందరైనా నచ్చుతుందోలేదో" చిన్నగా నిట్టూర్చింది. సరిగ్గా అనుకున్న టయానికి అనుకున్నట్టుగానే అమ్మాయింటికి చేరిపోయారు వాళ్లు.

ఇల్లు చూస్తూనే ముచ్చటపడిపోయాడు అతను. డ్రాయింగ్‌రూం డెకరేషన్, వాల్ పెయింటింగ్స్, క్లీన్‌గా వున్న సరౌండింగ్స్. క్రింద మెత్తగా తగులుతోన్న కార్పెట్ ఇంటి వాళ్ల 'టేస్ట్' చెప్పకనే చెబుతున్నాయ్...

ఫార్మాలిటీస్ పూర్తయ్యాక...

అప్పుడు వచ్చింది మెల్లగా అడుగులో అడుగేస్తో ఓ మెరుపుతీగ!

అంతే! అతని గుండె ఒక్క క్షణం కొట్టుకోవడం మానేసింది. గొంతులో గుటక పడడం ఆగిపోయింది. సరిగ్గా అతని ఊహలకు ప్రతిరూపాన్నిస్తోన్నట్టుగా... ఆ అమ్మాయివి —

స్టన్నింగ్ లుక్స్... ఆ కళ్లల్లో ఏదో తెలియని మత్తు, మైమరుపునిస్తున్నట్టుగా... తడిబారిన పెదవులు, ఒంపుతిరిగి కవ్విస్తో... 36 — 28 — 36 ఫిగర్ని యమ శ్రద్ధగా మెయింటేన్ చేస్తోన్నట్టు... వుండవలసిన ప్లేసులో తప్ప ఎక్కడా ఎక్స్‌ట్రా కండ కన్పించడంలేదు.

నిమ్మపండు ఛాయపై కట్టిన ఎమరాల్డ్ గ్రీన్ శారీపై ఒంటిరంగు రిఫ్లెక్ట్ అయి... అచ్చంగా పచ్చటి ప్రకృతిలోంచి ఆహ్వానిస్తూ వచ్చినట్టుగా వనకన్యలా వుంది.

ఇంక అతని పరిస్థితి వర్ణనాతీతం! ఏ ఆడపిల్లకై ఇన్నాళ్లు నిరీక్షిస్తూ కాలం గడిపాడో అలాంటి కన్నెపిల్ల ఎదురుగా సాక్షాత్కరించే సరికి రెప్పవాల్చడం మరిచిపోయాడు.

కొడుకు అంతరంగాన్ని పసిగట్టిన తల్లి "వచ్చే శ్రావణంలో ముహూర్తాలు పెట్టించేయండి అన్నయ్యగారూ..." అంటూ పురమాయించేసింది.

☆ ★ ☆

"ఏవిటి? మరీ ఇంత ధైర్యం మీకు! పెళ్లికాకుండా ఇలా రమ్మని అడగొచ్చా! ఎక్కడ బాధపడతారో అని వచ్చాను" బుంగమూతిపెట్టి మాట్లాడుతోంటే ముచ్చటపడిపోతూ ఆమెనేచూస్తోన్న అతను...

"ఓహ్! వాటే బ్యూటీ? రియల్లీ అయాం లక్కీ... నువ్వొప్పుకుని రావడమే నాకో వరం! ఇహ ఎన్నయినా అను పడతాను" అంటూ ఆమె చేతిని దగ్గరకు లాక్కుని మెల్లగా తాకుతూ...

"ఏయ్! ఏవిటా అల్లరి పనులు! ఇదేమైనా స్టేట్సా? పెళ్లికాకుండా డేటింగ్‌లంటూ తిరగడానికి. మన ఇండియా?! ఏమాత్రం హద్దుదాటినా వూరుకునేది లేదు" అంటూ అల్లరిగా బెదిరిస్తూ...

చిక్కని చీకట్లు మెల్లమెల్లగా ముసురుకుంటుంటే అక్కడక్కడా వున్న జనం పల్చబడిపోతూ... మూలగా కార్నర్‌లో సరుగుడు చెట్ల గుబురులో కూర్చున్న వారిద్దరి ఏకాంతానికి భంగం చేస్తూ...

ఉన్నట్టుండి ఉరిమిందో మేఘం...

'టప్ టప్'మని వర్షిస్తే...

హఠాత్తుగా మారిపోయింది వాతావరణం!

వడివడిగా జడిజడిగా కురుస్తోన్న జడివాన...

మేఘాల్ని చీల్చుకుంటూ మెరుస్తోన్న మెరుపులు...

ఆ ఘర్జనలకి ఒకింత బెదురుతూ దగ్గరగా జరిగింది ఆమె. పూర్తిగా తడిసిపోయారిద్దరూ...


అతనికి అతుక్కుపోతూ... ఆ చేయి ఒంపులో తలాన్చి కళ్లు మూసుకున్న ఆ రూపం...

అతన్ని వివశుడ్ని చేసేస్తూ...

ఒత్తయిన ఆ కనురెప్పలపై తొలిముద్దు... సరిహద్దుని చెరిపేస్తే...

కంఠాన్ని స్పృశించి కిందకి దిగిపోతోన్న అతని స్పర్శ...

చల్లని వాతావరణంలో వెచ్చవెచ్చగా తగిలి గిలిగింతలుపెడ్తోన్న అతనిఊపిరి...



కన్నెరికానికి బ్రహ్మచర్యానికి వీడ్కోలు ఇచ్చేస్తూ ఆ ఇద్దరూ అలా ఆ పచ్చిక బయలుపైనే వెనక్కి వాలిపోయారు...

సిగ్గుపడ్డ చీకటి మరింత చిక్కటి దుప్పటిని కప్పేసుకుంది.

☆ ★ ☆

వెచ్చటి దుప్పటిలో మత్తుగా, ఆనందంగా కలలు కనేస్తోన్న అతనికి తల్లి అరుపు చిన్న జడుపునే ఇచ్చింది.

"ఒరేయ్! లే! ఆఫీసుకి టైమైంది. లేరా!? పొద్దుపోయి ఇంకా పాడునిద్రేవిటి? సూర్యోడొచ్చి చాలా సేపైతేనూ..." అరిచింది తల్లి.

ఒక్క ఉదుటున లేస్తూ గబగబా తయారైపోతూ భోజనం ముందు పేపర్ తిరగేస్తూ కూర్చునేసరికి — రెండో పేజీలో ఆ బొమ్మ టక్కున అతని కళ్లని ఆపేసింది.

'గాడ్!' చిన్నగా కేకేయబోయి అంతలోనే తల్లి చూస్తోందని సర్దుకుంటూ...

'ఇదేవిటి? నిన్న చూసొచ్చిన అమ్మాయిలా వుంటే? వుంటే ఏవిటి? నా మొహం ఖచ్చితంగా ఆ కన్యామణే... మరేవిటీ పోజు! పిక్కలు దాటని చిన్న జీన్స్ నిక్కరు దానిపై స్లీవ్‌లెస్ టాప్‌తో ఓ మగాడిపక్కన మంచాని కాఫీ తాగుతూ" అదో కాఫీ అడ్వర్‌టైజ్‌మెంట్...

ఇంక అతనికి ముద్ద దిగలేదు. అసలా 'యాడ్' చూసినప్పట్నుండి ఆ మనసు మనసులో లేదు. ఏదో తెలియని ఆవేశం... ఉద్రేకం... కోపం లోలోన బుసలు కొడుతోంటే — తిన్నగా బయలుదేరాడు ఆమె ఇంటికి —

తీరా వెళ్లేసరికి హాల్లోనే ఎదురయింది ఆమె. పల్చని నైటీలో ప్రవోకింగ్‌గా సోఫాలో కూర్చుని పేపర్లో వచ్చిన తన యాడ్ ఫోటోనే తదేకంగాచూసి మురిసిపోతోంది.

చిన్నగా దగ్గాడు తన రాకను సూచిస్తున్నట్టుగా...

తలెత్తి చూసి "ఓ! మీరా! రండి! వెల్‌కం! ఏవిటి ఇలా వచ్చారు. ఏమైనా చెప్పాలా?! ఆ... అన్నట్టు ఈరోజు పేపర్లో నా మోడలింగ్ ఫోటో వచ్చింది. చూడండి! చాలా చక్కగా వుందికదూ" ఎంతో కూల్‌గా ఈజీగా చెప్పేస్తోన్న ఆమెని ఏం అనాలో తెలీక కొంచెం గాభరా పడిపోయి... మెల్లగా నోరు విప్పాడు.

"పెళ్లికి ముందు పోనీ ఓ.కె. కాని ఆఫ్టర్ మేరేజ్ నాకిలాంటివి నచ్చవు. అయినా ఒకరి భార్య అయ్యాక ఇలాంటి యాడ్స్‌కు మీరుకూడా ఒప్పుకోరంటాను? చక్కగా పెళ్లిచేసుకుని మనిద్దరమే హ్యాపీగా లైఫ్ లీడ్‌చేస్తోంటే బావుంటుందికదూ"

అతని మాటలింకా పూర్తికాకముందే... ఆమె ఉలిక్కిపడుతూ "వ్వాట్!? పెళ్లయ్యాక నేను మోడలింగ్ స్టాప్ చెయ్యాలా? నాన్సెన్స్! మీరేదో గొప్ప ఆదర్శభావాలు కలవారని విన్నానే! అయినా చదువుకుని ఉద్యోగం చేస్తూ సొసైటీలో మూవ్ అవుతోన్న మీరు ఇంత మూర్ఖంగా మాట్లాడతారేంటి!?! అయ్ డోంట్ లైక్ దిస్ టైప్ ఆఫ్ బిహేవియర్! నాకు అందం వుంది. మంచి ఫిగరుంది. దాన్ని ఎగ్జిబిట్ చేయడంలో తప్పేంవుంది. ఈ బ్యూటిఫుల్ స్ట్రక్చర్‌ని పెళ్లయ్యాక మీకూ — వంటింటికే అంకిత

ం చేయాలా?! నో! నో! నేను అంగీకరించను. ప్రస్తుతం నాకు సినిమా ఛాన్సులు కూడా వస్తున్నాయ్! బోల్డంత డబ్బు, పేరు వస్తుంది. మీక్కూడా మంచిదేగా! ఓ సినీతార భర్తగా హాయిగా ఆనందంగా బ్రతికేయవచ్చు! ఏమంటారూ?" అని నొక్కిచెబుతోన్న ఆ మాటలకు అతనేమీ సమాధానం ఇవ్వలేకపోయాడు!

అతని దగ్గర జవాబుంటేగా?!

☆ ★ ☆

